నవతెలంగాణ
1
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | ఏప్రిల్ 24, 2024 | www.navatelangana.com

ఘనంగా ఉద్యోగ విరమణ మహోత్సవం



నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని తట్టికోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బయోసైన్స్ ఉపాధ్యాయులు నాగేందర్ ఉద్యోగ విరమణ మహోత్సవం కార్యక్రమాన్ని మంగళవారం పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు నాగేందర్ అందించిన సేవలను గుర్తు చేసుకుని సన్మానించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కిషోర్ కుమార్, కాంప్లెక్స్ హెడ్మాస్టర్ అజీముద్దీన్, మండల విద్యాధికారి నాగనాథ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, వీరప్ప, వి.నరేందర్, అర్సపల్లి జిహెచ్‌యంఆర్ వెంకట్ నారాయణ్‌గౌడ్, పి.యస్.ప్రధానోపాధ్యాయులు లలిత విద్యార్థులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఎంపీ అభ్యర్థిగా బట్టెంకి బాల్‌రాజు



నవతెలంగాణ-కామారెడ్డి

బహుజన సమాజ్ పార్టీ జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా బట్టెంకి బాల్‌రాజును ప్రకటించినట్టు ఆయన తెలిపారు. తనను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించిన రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్, సెంట్రల్, స్టేట్ కో ఆర్డినేటర్ ఎం.బాలయ్య, సెలక్షన్ కమిటీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. గత 13 సంవత్సరాలుగా పార్టీకి చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ అవకాశం ఇచ్చినందుకు రాష్ట్ర అధినాయకత్వానికి రుణపడి ఉంటానని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం పరిరక్షణలో భాగంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలను కలుపుకొని గెలుపు దిశగా ప్రయాణం చేస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని వివరించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటూ కీలకం

- ఓటు హక్కును ట్రాన్స్‌జెండర్లు సంపూర్ణంగా వినియోగించుకోవాలి
- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు కీలకమని, రాజ్యాంగం తమకు కల్పించిన ఓటు హక్కును ట్రాన్స్‌జెండర్లు సంపూర్ణంగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం స్వీప్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఓటు వేయడానికి వెళితే అందరూ తమరిని చులకనగా చూస్తారన్నా అపోహ వీడనాడి, ఓటు ప్రాముఖ్యతను తెలుసుకొని ధైర్యంగా ఓటు వేయాలని అన్నారు. జిల్లాలో సుమారు 30 మందికిపైగా ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని, గత శాసనసభ ఎన్నికల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని ప్రశంసించారు. ఇంకా ఎవరైనా ఓటరుగా మిగిలి ఉంటే వెంటనే ఓటరు హెల్ప్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని, ఈ నెల 25న ఓటరు తుదిజాబితా విడుదల చేస్తామని అన్నారు. ఓటింగ్‌లో పాల్గొనడంపై అవగాహన కలిగి ఉండడంతో పాటు తోటి వారిలో చైతన్యం తెచ్చి మే 13న జరిగే పోలింగ్‌లో వంద శాతం ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమాధికారి బావయ్య, స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.


సమావేశానికి హాజరైన ట్రాన్స్‌జెండర్లు

18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు తన ఓటును నిజాయితీగా వేయాలి..

18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు తన ఓటును నిజాయితీగా వేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న రాశివనంలో మంగళవారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్విఫ్ కార్యక్రమంలో భాగంగా ఓటర్ ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేయాలని తెలిపారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో మతాలకతీతంగా ఓటు వేయాలన్నారు. ఓటు వేయడం ప్రతి పౌరుడు తన బాధ్యతగా భావించాలని సూచించారు. అనంతరం ఓటర్ సెల్ఫీ పాయింట్ వద్ద జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులతో, వాకర్ అసోసియేషన్ ప్రతినిధులతో సెల్ఫీ దిగారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి వెంకటేష్, జిల్లా అధికారులు రాజారాం, వరదారెడ్డి, వెంకట్ రెడ్డి, సాయిలు, వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు లింగం, బాలయ్య, శంకర్, రాజ్ గంభీర్ రావు, ప్రతినిధులు పాల్గొన్నారు.

మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించిన జిల్లా కలెక్టర్..

కామారెడ్డి కలెక్టరేట్‌లోని మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 1950కి వచ్చిన ఫిర్యాదుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. 1950కు ఈరోజు వరకు 493 ఫిర్యాదులు వచ్చాయని వాటిని తక్షణమే పరిష్కరించినట్లు తెలిపారు. సి-విజిల్‌కు 40 ఫిర్యాదులు రాగా 30 తక్షణమే పరిష్కారం చేసినట్లు తెలిపారు. పది ఫిర్యాదులు అనవసర ఫిర్యాదులుగా గుర్తించి వాటిని తిరస్కరించినట్లు చెప్పారు. పత్రికల్లో, టీవీ ఛానల్లో వచ్చే ఫేక్ న్యూస్, ఫేడ్ న్యూస్‌లు గుర్తించాలని సూచించారు. ఎంసీఎంసీ అనుమతి లేకుండా పత్రికల్లో, టీవీ ఛానల్లో రాజకీయ పార్టీలు ప్రకటనలు వేయరాదని తెలిపారు. కార్యక్రమంలో ఎంసిఎంసి నోడల్ అధికారి మురళి కృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

సెలవుల్లో ఇంటివద్దే చదువుకోవాలి

- చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లొద్దు
- డీఈవో దుర్గాప్రసాద్
- అమ్దాపూర్ పాఠశాల తనిఖీ


మాట్లాడుతున్న డీఈవో దుర్గాప్రసాద్

నవతెలంగాణ-బోధన్

విద్యార్థులు సెలవుల్లో ఇంటివద్దే చదువుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ అన్నారు. చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లవద్దని సూచించారు. బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పాథమికోన్నత పాఠశాల, కస్తూరిబా గాంధీ పాఠశాలను మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రికార్డులు నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. నేటి నుంచి పాఠశాలలకు సెలవులు ఉన్నందున విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందించారు. విద్యార్థులతో వారు నేర్చుకున్న అంశాలపై ముచ్చటించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో బహిరంగ ప్రదేశాలలో విద్యార్థులు తిరగకూడదని సూచించారు.

చెరువులు, కుంటలు, కాల్వల వద్దకు వెళ్లరాదని విద్యార్థులకు సూచించారు. ఇంటి దగ్గర చదువుకోవాలని తెలిపారు. సాయంత్రం సమయంలో మాత్రమే ఆడుకోవాలని పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాల మరమ్మతు పనులను పరిశీలించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులకు ఎంపికైన ఉపాధ్యాయులు వేసవిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట జీసిడిఓ అనిత, ప్రధానోపాధ్యాయులు సూర్యకుమార్, ఖలీల్ అహ్మద్, కేజీబీవీ ఎస్ఓ హిమబిందు, సిఆర్పి శివానందం, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

నేడు ఇంటర్ పరీక్ష ఫలితాలు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నేడు ఇంటర్ పరీక్ష ఫలితాలు వెలువడనున్నాయి. ఇంటర్ పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 19 వరకు నిర్వహించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా మొదటి, రెండో సంవత్సరం ఇంటర్ విద్యార్థుల ఫలితాలు ఒకే రోజున విడుదల కానున్నాయి. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 35,346 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా. వీరిలో మొదటి సంవత్సరం మొత్తం విద్యార్థులు 17,364 కాగా రెండవ సంవత్సరం విద్యార్థులు 17,982 మంది ఉన్నారు. అందులో మొదటి సంవత్సరం జనరల్ 14,965 మంది, 2,399 మంది ఒకేషనల్ విద్యార్థులు ఉన్నారు. రెండవ సంవత్సరంలో రెగ్యులర్ జనరల్ విద్యార్థులు 13,986 మంది, ప్రైవేట్ 1,804 మంది విద్యార్థులు, రెండవ సంవత్సరం ఒకేషనల్ రెగ్యులర్ 1,999 మంది విద్యార్థులు, ప్రైవేట్ 193 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. వాటి ఫలితాలు నేడు విడుదల కానున్నాయి. ఈ ఫలితాలలో ఎంత మేరకు ఉత్తీర్ణత శాతం వచ్చేనో జిల్లాకు ఏ స్థాయి ర్యాంకు వచ్చేనో వేచిచూడవలసిందే. పరీక్ష ఫలితాలు ఏ విధంగా వచ్చినా.. విద్యార్థులు అసంతృప్తికి గురికావొద్దని పలువురు విద్యావేత్తలు అంటున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు మనోధైర్యం కల్పించాలని చెబుతున్నారు. ఈ పరీక్ష ఫలితాలతోనే జీవితం ముగియదనేది విద్యార్థులు గమనించాలని, పరీక్ష ఫలితాల సమయంలో మనోధైర్యంతో ఉండాలని పలువురు విద్యావేత్తలు సూచిస్తున్నారు.

మనువాదాన్ని ఓడిద్దాం, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

- డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

నవతెలంగాణ-కామారెడ్డి

మనిషిని మనిషిగా చూడ నిరాకరించిన మనువాదాన్ని ఓడించి ప్రజలందరికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందిస్తున్న భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ అన్నారు. డిబిఎఫ్ అధ్వర్యంలో భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారోద్యమ సదస్సును మంగళవారం కామారెడ్డిలో రాజ్యం పరిరక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. మహనీయులైన పూలే, అంబేద్కర్, జగ్‌జీవన్‌రామ్‌ల జయంతుల మహోత్సవం సందర్భంగా రాజ్యాంగ రక్షణ ప్రచారోద్యమాన్ని చేపట్టామని శంకర్ తెలిపారు. విద్య, ఉద్యోగం, ఆస్తులు, సంపదలను రాజకీయ అధికారాన్ని అణగారిన వర్గాలకు మనువాదం దూరం చేసిందన్నారు. మానవ హక్కులను అందించిన రాజ్యాంగాన్ని 400 సీట్లు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని పదే పదే ప్రకటిస్తున్న కేంద్ర మంత్రుల కుట్రలను అర్థం చేసుకుని రానున్న పార్లమెంట్ ఎన్నికలలో బిజెపిని ఓడించి రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. దళిత నేత మల్లయ్య మాట్లాడుతూ.. గత పదేండ్లుగా మోడి ఇచ్చిన ఏ హామీని నేరవెర్చలేదన్నారు. తెలంగాణ జన సమితి జిల్లా కన్వీనర్ లక్ష్మణ్ మాట్లాడుతూ.. రాజ్యాంగ, ప్రజాస్వామ్య స్ఫూర్తిని కేంద్ర పాలకులు కాలరాస్తున్నారన్నారు. బివియం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విఠల్ మాట్లాడుతూ.. రెండుకోట్ల ఉద్యోగాలను భర్తీ చేస్తామనే హామీని నిలబెట్టుకోలేదన్నారు. సమావేశంలో గంగాధర్, డిబిఎఫ్ జిల్లా కన్వీనర్ మేకల లావణ్య, నాయకులు ప్రవీణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత


బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని మోషన్‌పూర్ గ్రామానికి చెందిన బొంపల్లి రవి ద్విచక్ర వాహనంపై వెళు ుండగా కోతులు అడ్డురావడంతో ప్రమాదవశాత్తు వాహనం నుంచి పడి కాలు విరగడంతోపాటు గాయాలు కావడంతో, గత నాలుగు నెలల క్రితం పోస్ట్ ఆఫీస్‌లో రూ.520తో ప్రమాద బీమా తీసుకోవడంతో, ఆయనకు ప్రమాద బీమా కింద ఆసుపత్రి ఖర్చుల నిమిత్త రూ.77,000 విలువ గల చెక్కును జిల్లా ఐపిపిబి మేనేజర్ పవన్‌రెడ్డి, స్థానిక ఎంపీడీవో సవితారెడ్డితో కలిసి బాధితుడికి చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. పోస్టాఫీస్ పేద ప్రజలకు అందిస్తున్న అతి తక్కువ ప్రీమియంతో, 10లక్షల ప్రమాద బీమాను అందజేయడాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. పవన్‌రెడ్డి మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో ఇప్పటివరకు 18 మంది లబ్ధిదారులకు రూ.ఒక కోటి 80 లక్షల క్లైమ్, 25 మందికి మెడికల్ క్లెయిమ్స్ సెటిల్ చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో ధర్మారెడ్డి, ఎస్‌పిఎం వేణుగోపాల్, పోస్టాఫీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా హనుమాన్ విజయయాత్ర

- పెద్దఎత్తున పాల్గొన్న యువకులు



శోభాయాత్రలో భారీ హనుమాన్ విగ్రహం.. శోభాయాత్రలో పెద్దఎత్తున పాల్గొన్న యువకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వీర హనుమాన్ విజయ యాత్రను నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని చేపట్టారు. నగరంలోని వీర హనుమాన్ విజయయాత్రను కంఠేశ్వర్ ప్రాంతంలో గల నీలకంఠేశ్వర ఆలయం వద్ద నుంచి ప్రారంభమై జడ్పీ ఆఫీస్, నాందేవ్‌వాడ మీదుగా శివాజీచౌక్ నుంచి దేవీ రోడ్డు మీదుగా గాంధీచౌక్, పెద్దబజార్ నుంచి ఆర్ఆర్ చౌరస్తాకు చేరుకుంది. విజయయాత్రలో హనుమంతుడు, శ్రీరాముడు, శివుడు, శివాజీ, దత్తాత్రేయ, తెలంగాణ తల్లి విగ్రహాలను ర్యాలీలో ఏర్పాటు చేశారు. ఈ శోభాయాత్రలో నిజామాబాద్ ప్రజలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. పెద్ద సౌండ్‌తో కూడిన డీజే బాక్సులను ఏర్పాటు చేయగా.. యువకులు నృత్యాలు చేస్తూ ముందుకు కొనసాగారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు చేపట్టారు. ఈ శోభాయాత్రలో సుమారు 1200 మంది పోలీస్ సిబ్బంది పాల్గొని శోభాయాత్రను పర్యవేక్షించారు. శోభాయాత్ర ప్రారంభం నుంచి పూర్తయ్యేవరకూ ప్రతి అడుగడుగునా ప్రజలు మంచినీటి ప్యాకెట్లను, పులిహోరను, మజ్జిగ, కర్బూజాలను ర్యాలీలో పాల్గొన్న వారికి అందజేశారు. అలాగే శోభయాత్ర సందర్భంగా అక్కడక్కడ పడిన చెత్తచెదారాన్ని, టిఫిన్ ప్లేట్లన్లు, గ్లాస్‌లను మున్సిపల్ కార్మికులు ఎప్పటికప్పుడు తొలగించారు. చెత్త కనిపించకుండా చీపుర్లతో ఊడ్చేస్తూ ట్రాక్టర్ ద్వారా చెత్తను తొలగించారు.


చెత్తను తొలగిస్తున్న కార్మికులు

కాంగ్రెస్ యూత్ జిల్లా జాయింట్ సెక్రటరీగా షేక్ అజీజ్


నియామకపత్రాన్ని అందుకుంటున్న అజీజ్

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలం సోమారంపేట్ గ్రామనికి చెందిన షేక్ అజీజ్‌ను కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ ఆదేశాల మేరకు కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు మహమ్మద్ ఇలియాజ్ షేక్ అజీజ్‌కు నియమాకపత్రాన్ని అందజేశారు. అనంతరం కామారెడ్డి జిల్లా యూత్ అధ్యక్షులు ఇలియాస్ మాట్లాడుతూ.. రాబోయే ఎంపీ ఎన్నికల్లో చురుకుగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని షేక్ అజీజ్‌కు సూచించారు. అనంతరం షేక్ అజీజ్ మాట్లాడుతూ.. తనపై విశ్వాసం ఉంచి కాంగ్రెస్ యూత్ జిల్లా జాయింట్ సెక్రటరీగా నియమించిన పెద్దలు తెలంగాణ ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ ఆలీకి కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు మహమ్మద్ ఇలియజ్‌కు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ నయీమ్‌కు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేస్తానని రాబోయే ఎంపీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సందీప్, అమీర్ హుస్సేన్, శ్రీధర్, యం.డి ఆశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ సార్... మా సమస్యను పరిష్కరించండి

- విద్యార్థుల విన్నపం


ధర్నా చేస్తున్న ఛాత్రోపాధ్యాయ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నగరంలో ఉన్న డైట్ కళాశాలలో ఉర్దూ మీడియంకి సంబంధించిన డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులను యధావిధిగా విధులను కొనసాగించాలని, రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించాలని చాత్రోపాధ్యాయ విద్యార్థులు డైట్ కళాశాల ఎదుట మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఛాత్రోపాధ్యాయ విద్యార్థులు మాట్లాడుతూ.. డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులను కొనసాగిస్తూ, రెగ్యులర్ ఫ్యాకల్టీని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని గతంలో జిల్లా కలెక్టర్‌ని కోరామన్నారు. కానీ డిప్యూటేషన్‌లో ఉన్న ఇద్దరు ఫ్యాకల్టీని కూడా ఇప్పుడు తీసివేయడం చాలా బాధాకరమన్నారు. ఉన్న ఫ్యాకల్టీని తీసివేస్తే ఉర్దూ మీడియం సంబంధించిన చాత్రోపాధ్యాయ విద్యార్థులకు ఎవరు బోధిస్తారని, విద్యార్థులు అధికారులను, ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఛాత్రోపాధ్యాయులు లేకపోవడంవల్ల అకాడమిక్ పరంగా తీవ్రంగా నష్టపోతున్నామని అన్నారు. అకాడమిక్ సంవత్సరం ముగుస్తున్న సందర్భంగా తక్కువ సమయంలో ఎక్కువ సిలబస్ పూర్తి చేయడానికి ఇప్పుడు ఉన్నటువంటి ఉపాధ్యాయులు ఇబ్బంది, ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఫైనల్ ఇయర్‌లో ఉన్న విద్యార్థులకు సిలబస్ పూర్తికాకపోవడంతో టెట్, డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిన తరుణంలో విద్యార్థులు అయోమయంగా ఉన్నారన్నారు. డైట్ కళాశాలలో మేనెలలో తరగతులు జరిగే అవకాశం ఉందని అదేవిధంగా జూన్ మొదటి వారంలో పాఠశాలలు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. దానితో ఛాత్రోపాధ్యాయులకు సిలబస్ పూర్తి కావడం కాకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని, నిజామాబాద్ కలెక్టర్ స్పందించి డిప్యూటేషన్‌లో ఉన్న ఉపాధ్యాయులను కొనసాగిస్తూ, అదే తరుణంలో రెగ్యులర్ ఫ్యాకల్టీని వెంటనే నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డైట్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్‌ను కలిసిన సిఐటియు నాయకులు


మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి మున్సిపల్ సిఐటియు నాయకులు జిల్లా అధ్యక్షుడు రాజన్న ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియను కలిసి శాలువాతో సన్మానించి పూలబోకేను అందించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మర్యాద పూర్వకంగా మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు రాజనర్సు ఆధ్వర్యంలో సీఐటీయూ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు.

డాక్టర్ బాలుకు ఉత్తమ సామజికసేవా పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ బాలు

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా కేంద్రానికి చెందిన ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుకు తలసేమియా సికిల్ సెల్ సొసైటీ హైదరాబాద్ వారు మంగళవారం ఉత్తమ సామాజిక సేవా పురస్కారాన్ని అందజేశారు. తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం 22 రక్తదాన శిబిరాల నిర్వహించి 2306 యూనిట్ల రక్తాన్ని సంవత్సర కాలంలోనే అందజేసినందుకు ఈ పురస్కారాన్ని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పర్లపల్లి రవీందర్, తలసేమియా సికిల్ సెల్ సొసైటీ నిర్వాహకుడు వంశీ అందజేశారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన ఎంపీటీసీ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీటీసీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని ధర్మారావుపేట్ ప్రాథమిక పాఠశాలలో ధర్మారావుపేట్ ఎం.పి.టి.సి మహిపాల్ యాదవ్ విద్యార్థులతో మంగళవారం సహపంక్తి భోజనం చేసినట్లు తెలిపారు. పాఠశాల చివరి పనిదినం రోజున విద్యార్థులతో కలిసి భోజనం చేయడం ఆనందం కలిగిందన్నారు. విద్యార్థులు వేసవి సెలవులో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి విద్యార్థులకు సలహాలు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సదాశివ్, ఉపాధ్యాయులు మోహన్‌రావు, బాల్‌చంద్రం, మధుక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

రానున్న మూడు రోజులు వర్షసూచన

• వరి ధాన్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్

నవతెలంగాణ-ఏర్గట్ల

రానున్న మూడు రోజుల పాటు వర్షసూచన ఉన్నందున రైతులు తమ వరిధాన్యాన్ని టార్పాలిన్ కాగితాలతో కప్పి ఉంచి కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి అబ్దుల్ మాలిక్ రైతులకు తెలియజేశారు. మంగళవారం మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. నాణ్యత ప్రమాణాలు పాటించి వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. ఆయన వెంట సంఘ సీఈఓ జక్కని శ్రీనివాస్, సెంటర్ ఇంచార్జ్ సతీష్ గౌడ్, రైతులు ఉన్నారు.

కిశోర బాలికలకు అవగాహన



బాలికలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం సిడిపిఓ భార్గవి ఆదేశానుసారం అంగన్వాడి సూపర్వైజర్ వెంకట రమణమ్మ ఆధ్వర్యంలో కిశోర బాలికలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, వ్యక్తిగత పరిశుభ్రత, రక్తహీనతకు గల కారణాలు, తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098 అని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, అంగన్వాడి టీచర్ లక్ష్మీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధి దాతకు సన్మానం



దాతను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలో జలాల్‌పూర్ గ్రామంలోని హనుమాన్ మందిరం అభివృద్ధికి కృషిచేసిన గుండేటి పెద్దోళ్ళ మోహన్ రెడ్డిని గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. హనుమాన్ మందిరం చుట్టూ రెండు లక్షల రూపాయలతో రేకుల షెడ్డును దాత గుండేటి పెద్దోళ్ల మోహన్ రెడ్డి నిర్మించారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి పాటుపడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామపంచాయతీ మాజీ పాలకవర్గ సభ్యులు, హనుమాన్ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

పీజీ రెగ్యులర్ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని పీ. జీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్‌ను మంగళవారం విడుదల చేశారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంఎస్ డబ్ల్యూ, ఎంకాం, ఎల్ఎల్‌బి, ఎల్ఎల్ఎం, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్స్ ఏపీఈ, ఐఎంబిఏ, ఐపిసిహెచ్ కోర్సులకు గాను నాల్గవ, ఆరవ, ఎనిమిదవ, పదవ సెమిస్టర్ (థియరీ, ప్రాక్టికల్) ఎంబీఏ, ఎంసీఏ నాలుగవ సెమిస్టర్, ఐఎంబీఏ ఎనిమిదవ, పదవ సెమిస్టర్ పరీక్షలు జూన్ నెలలో జరగబోయే పరీక్షలకు ఫీజు తేదీలను ప్రకటించారు. ఫీజు చెల్లించుటకు చివరి తేదీ 30 ఏప్రిల్ వరకు 100 రూపాయల అపరాధ రుసుముతో 06 మే వరకు చెల్లించాల్సి ఉంటుందనిపరీక్షల నియంత్రణాధికారిని ప్రొఫెసర్ డాక్టర్ ఎం.అరుణ తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్సైట్లో పొందు పరచడం జరిగిందని కంట్రోలర్ వివరించారు.

బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో 'మార్పు'కథల పుస్తకావిష్కరణ



విద్యార్థిని సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఏర్గట్ల

ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇందూరు జిల్లా బాల సాహిత్య వేదిక ఆధ్వర్యంలో తడపాకల్ పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న నూకల వైష్ణవి రచించిన 'మార్పు' అనే కథల పుస్తకాన్ని ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ జావీద్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ మాట్లాడుతూ.. మంచి సందేశంతో కూడిన 21కథలు ఈ పుస్తకంలో ఉన్నాయని అన్నారు. చిన్న వయసులో సాహిత్యంపై మక్కువ పెంచుకుని, కథలు రాసిన నూకల వైష్ణవిని పలువురు అభినందించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థిని సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, గంగాధర్, కృష్ణప్రసాద్, రాములు, నరేంధర్, నాగప్ప, స్వప్న, సుజాత, విజయ పాల్గొన్నారు.

మే 1నుంచి టిసిసి కోర్సు శిక్షణ తరగతులు

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

టెక్నికల్ టీచర్స్ సర్టిఫికేట్ (టిసిసి) కోర్స్‌కు మే 01 నుండి జూన్ 13 వరకు (42) రోజుల వేసవి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్వి దుర్గాప్రసాద్ మంగళవాకం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల ఆదేశాల మేరకు ఈ కోర్స్‌కు ఈనెల 22 నాటికి 18 సంవత్సరం వయస్సు నిండి ఉండి 45 సంవత్సరాల వయస్సు వారు అర్హులని పేర్కొన్నారు. అభ్యర్థులు పదవ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, చేరబోయే సంబంధిత కోర్స్‌లో లోయర్ గ్రేడ్ టిసిసి ఉత్తీర్ణులై ఉండాలి అని, ఇతర రాష్ట్రాల వారు అడ్మిషన్ పొందాలంటే ముందుగా సంచాలకులు, పరీక్షల విభాగం, హైదరాబాద్ వారి అనుమతి పొందాలని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు అడ్మిషన్ కార్డును ఈనెల 23 నుండి వెబ్ సైట్ www.bse.telangana.gov.in నుండి డౌన్లోడ్ చేసుకొని, పూర్తి చేసిన దరఖాస్తులకు ఒక ఫోటో, లోయర్ గ్రేడ్ పాస్ మెమో లేదా రిజల్ట్ కాపీ, ఎస్ఎస్సి లాంగ్ మెమో జిరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్ (జిరాక్స్‌లపై గెజిటెడ్ అధికారి అటెస్ట్ చేసి) లను జతపరిచి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక



అన్నదాత విక్రమ్‌అలీని సన్మానిస్తున్న సప్తమహాసంఘం సభ్యులు

నవతెలంగాణ-భీంగల్

హనుమాన్ జయంతిని పురస్కరించుకొని భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన ముస్లిం వ్యక్తి విక్రమ్ అలీ అన్నదాన సత్రాన్ని ఏర్పాటుచేసి మతసామరస్యానికి ప్రత్యేకంగా నిలిచాడు. 11వ వార్డుకు చెందిన విక్రమ్ ఆలీ అదే కాలనీలో సప్త మహా సంఘం వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభినందించారు. ఈ సందర్భంగా సప్త మహా సంఘం సభ్యులు ఆలి సన్మానించారు. కార్యక్రమంలో సప్త మహా సంఘం సభ్యులు పాల్గొన్నారు. భీంగల్ పట్టణ కేంద్రంలోని బోయ గల్లీ పవనసుత హనుమాన్ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. హనుమాన్ మాల ధరించిన భక్తులు కొండగట్టు, ఇతర ఆలయాల వద్ద మాల విరమించారు.

రైతులను మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలి

• కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్ రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి

రైతులను మోసం చేసిన వారికి బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి టి. జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని పీవీఆర్ భవన్లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో గతంలో పాలించిన కేసీఆర్ ప్రభుత్వం రైతులను మోసం చేశారని, ఎన్నికల సమయంలో అరవింద్ ను రైతులు గుర్తుకు వచ్చిరా.. అని ప్రశ్నించారు. కేంద్ర, గత రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం లోపించి తెలంగాణ రాష్ట్రంలో పంటల బీమాను అమలు చేయలేరని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే ఖరీఫ్ నుండి పంటల బీమా పథకం అమలు చేసేందుకు రైతులపై భారం పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. 2008-2009లో యూపీఏ ప్రభుత్వం లక్ష రూపాయలు ఒకేసారి రుణమాఫీ చేసిందని అన్నారు. ఆదాని అంబానీలకు 16 లక్షల కోట్లు మాఫీ చేసిన మోడీ హయాంలో అరవింద్ బాండ్ పేపర్‌పై పసుపు బోర్డు తెచ్చిన అంటూ నాటకం ఆడారని, గత ఐదు సంవత్సరాల నుండి రైతులు గుర్తుకు రాలేరని, కల్వకుంట్ల కవిత సైతం ఐదు సంవత్సరాలు ఏమి చేయలేదని అన్నారు. ఆర్మూర్-ఆదిలాబాద్ రైల్వే లైన్, లక్కంపల్లి సెజ్ ఫుడ్ ప్రాసెసింగ్ గాలికి వదిలేశారని తెలిపారు. పార్లమెంట్ పరిధిలో అత్యధిక సంఖ్యలో రైతులు, గల్ఫ్ కార్మికులు ఉన్నారని, రైతులను బీఆర్ఎస్, బీజేపీలు పట్టించుకోలేదని పసుపు బోర్డుపై అరవింద్ ఉత్తర్వులతోనే సరిపెట్టారని వాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సెప్టెంబర్ 17లోగా బోధన్ తో పాటు ముత్యంపేట చక్కెర కర్మాగారాలను తెరిపిస్తారని, 6 గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు నెలల్లో అమలు చేసిందని అన్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలతోపాటు టిఎస్ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత ప్రయాణం, ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు చెల్లించటం, గృహ అవసరాలకు 200 ఉచిత విద్యుత్, గ్యాస్ సిలిండర్ 100 రోజుల్లో అమలు చేసినట్టు తెలిపారు. రాహుల్ గాంధీ ప్రధాని కాబోతారని గత అభ్యర్థుల వైఫల్యాలు స్పష్టంగా కనబడుతున్నాయని, నియోజకవర్గంలో 20వేలపై మెజారిటీ వస్తుందని అన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని, పార్లమెంటులో ప్రజల సమస్యల కోసం పోరాటం చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, కౌన్సిలర్ అయ్యప్ప శ్రీనివాస్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు మార చంద్రమోహన్, మోత్కూరి లింగాగౌడ్, సాయిబాబా గౌడ్, ఇట్టెం జీవన్, చిట్టి రెడ్డి, పీఏసీఎస్ పెర్కిట్ చైర్మన్ పెంట భోజారెడ్డి, కౌన్సిలర్లు లిక్కి శంకర్, సడక్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ అభివృద్ధికి సహకరిస్తా

• ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

గ్రామంలో ఏ సమస్య ఉన్న అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందజేస్తూ గ్రామ అభివృద్ధికి ప్రత్యేకంగా దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రాంపూర్ (డి) గ్రామంలో హనుమాన్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల కార్యదర్శి లచ్చుమొల్ల దత్తాద్రితోపాటు ఇతరులు గ్రామంలో నెలకొని ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకుని వచ్చారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఏ అభివృద్ధి కార్యక్రమం అయినా తన దృష్టికి వచ్చిన వెంటనే నిధులను మంజూరు చేసే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. పాఠశాలలో అత్యవసరంగా మరుగుదొడ్లు గురించి గ్రామస్తులు ఆయన దృష్టికి తేగా ఎన్నికల కోడ్ అయిపోయిన వెంటనే ఆయా పనులకు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజలు చేసినట్లు ఆయన వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో సహకార సొసైటీ చైర్మన్ తరచంద్ నాయక్, కాంగ్రెస్ మండల అధ్య క్షుడు అమృతపూర్ గంగాధర్ మాజీ ఐడిసిఎంఎస్ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, యూత్ అధ్యక్షుడు నరేష్, గ్రామ ఉపాధ్య క్షుడు శేఖర్, సందీప్, నర్సగౌడ్, సీనియర్ నాయకులు కంచెట్టి గంగాధర్,హనుమాన్ సేవ సమి తి సభ్యులు రాజ్ కుమార్, చిన్న రాజన్న, సచిన్, సుమన్, శక్కర్ల పెద్ద రాజన్న, రాజేష్, సభ్యులు, గ్రామస్తులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అందరు సుభిక్షంగా ఉండాలి

దేశం, రాష్ట్రం గ్రామాల్లో ఉన్న ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్సీ వి గంగాధర్ గౌడ్ అన్నారు. మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా డిచ్‌పల్లి మండలం లోని రాంపూర్ (డి) గ్రామంలోని హన్మాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో హనుమాన్ సేవ సమితి సభ్యులు రాజ్ కుమార్, చిన్న రాజన్న సచిన్, సుమన్, శక్కర్ల పెద్ద రాజన్న రాజేష్,ఎల్ దత్తు, ఒడ్డెం నర్సయ్య,తో పాటు సభ్యులు గ్రామస్తులు గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డుల అందజేత

• ముగిసిన బడులు
• పునప్రారంభం జూన్ 12న

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి



భీంగల్ రూరల్ : విద్యార్థులకు వార్షిక ప్రగతి పత్రాలను అందజేసిన ఉపాధ్యాయులు

మండలంలోని నాగాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాసం శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం ముగింపు పురస్కరించుకొని ఈ తల్లిదండ్రుల సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి ఎండలు ఎక్కువగా ఉన్నందున విద్యార్థులను ఎండలో తిరగనివ్వద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చెరువులు, కుంటల్లో స్నానాలు చేయడానికి వెళ్లకుండా చూడాలన్నారు. ఈత రాకుండా చెరువులు కుంటలో స్నానానికి వెళ్లి ఎందరో చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. ఇంటి వద్ద తమ పిల్లలు ఎక్కువగా సెల్ ఫోన్‌తో ఆడకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు రాథోడ్ సాగర్, వీడిసి క్యాషియర్ పాలెపు రాజేశ్వర్, గడ్డం గోవర్దన్, ఉపాధ్యాయులు లత, స్వరూపా రాణి, స్వప్న, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

భీంగల్‌రూరల్ : మండలంలోని ముచ్కూర్ ఎంపీపీ ఎస్ పాఠశాలలో విద్యార్థులకు వార్షిక పరీక్షల ప్రగతి పత్రాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ స్వామి మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు అవుతున్న గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను విశేష కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దినేష్ ఉపాధ్యాయులు శ్రీనివాస్, జావేద్, గంగాధర్, పద్మ పాల్గొన్నారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో వార్షిక ఫలితాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఆన్లైన్ ప్రోగ్రెస్ కార్డులను ఉపాధ్యాయులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పతకాలతో సత్కరించారు. వేసవి సెలవుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలను గురించి తెలియజేశారు. తల్లిదండ్రులకు తగు సలహాలు ఇచ్చారు. ప్రధానోపాధ్యాయులు బాలయ్య, ఉపాధ్యాయులు గణేష్, ఈ.గణేష్, లక్ష్మిప్రసన్న, అనిత,విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ముప్కాల్ : వేసవి సెలవులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయడంతో 2023-24 విద్యాసంవత్సరం ముగిసిందని మండల విద్యాశాఖధికారి బట్టు రాజేశ్వర్ తెలిపా రు. జూన్ 12న తిరిగి పాఠశాలలు పునప్రారంభం అవుతా యని అన్నారు. మంగళవారం చివరి పాఠశాల రోజ ని, బుధవారం నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మార్కుల జాబితాలను అందజేశామన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఎలాంటి తరగతులు నిర్వహించవద్దని తెలిపారు.

డిచ్‌పల్లి : ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. 2023-24 విద్యా సంవత్సరంలో మంగళవారం చివరి పని రోజు కాగా 1-9వ తరగతి విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో జూన్ 12 నుంచి పాఠశాలలు పున్నప్రారంభం కానున్నాయి. వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులకు తల్లిదండ్రులు వసతి గృహాలకు వెళ్లి స్వగృహాలకు ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు బస్సుల్లో పెట్టెలు తమ వెంట ఉంచుకుని బయలు దేరారు. విద్యార్థులకు వేసవి సెలవులు దొరకడంతో వారి సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి.



డిచ్‌పల్లి : ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



ముప్కాల్: ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్, వేంపల్లి, రెంజర్ల, కొత్తపల్లి, నాగంపేట్, నల్లూర్, వెంచిర్యాల గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను ఆయా గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో భక్తుల మధ్య అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తులు భగవంతునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేసి నైవేద్యంను సమర్పించారు. నల్లూర్ గ్రామంలో హనుమాన్ మందిరం ఆవరణలో ములధారణ స్వాములు అన్నదాన సత్రం నిర్వహించారు. మండల కేంద్రంలో ముప్కాల్ లయన్స్ క్లబ్ వారు ఇటుక బట్టీల వద్ద కూలీలకు అన్నదానం ఏర్పాటు చేశారు.

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని గోల్ హనుమాన్, రోకడ్ హనుమాన్ ఆలయాల్లో మాజీ శాసనసభ్యులు గణేష్ బిగాల, ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శోభయాత్రలో ఆయన ఆధ్వర్యంలో జెడ్పి కార్యాలయం వద్ద మజ్జిగ, వాటర్ ప్యాకెట్లు, పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చిన నేను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ నీతూ కిరణ్, సిర్ప రాజు, ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, సత్యప్రకాశ్, దండు శేఖర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భీంగల్ : మండల్ జాగీర్యాల గ్రామంలోని. శ్రీ శ్రీ అభయ ఆంజనేయస్వామి. మందిరంలో యజ్ఞము. అన్న దానం చేశారు. కార్యక్రమము వీడిసి ఆధ్వర్యంలో జరిగినది వి డీసీ సభ్యులు.వడ్ల శంకర్. పోతునూరు శ్రీనివాస్, గడల రఘుపతి, సుమన్, పసులరాజేష్, కుంట శంకర్, వాక రమణయ్య, తలారి సురేష్, పెద్దోళ్ల అనిల్, భక్తులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిజామాబాద్ రూరల్ : సారంగపూర్ హనుమాన్ మందిరంలో హనుమాన్ జయంతోత్సవాలకు దూర ప్రాంతాల నుండి మహారాష్ట్ర నుండి భక్తులు తరలివచ్చారు. భక్తులకు మజ్జిగ, అన్నదానం కూడా ఏర్పాటు చేశారు.

విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలి

• ఎంపీడీవో



మాట్లాడుతున్న ఎంపీడీవో

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని ఎంపీడీవో సతీష్ కుమార్ అన్నారు. మండలంలోని అర్గుల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాలలోని ఉర్దూ పాఠశాలను ఎంపీడీవో సందర్శించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని ఆదర్శ అమ్మ కమిటీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో మండల పంచాయతీ రాజ్ సురేంద్ర వర్మ, ఏపిఎం రవీందర్ రెడ్డి, కమ్యూనిటీ కోఆర్డినేటర్, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలకు అమ్మ ఆదర్శ పాఠశాల కింద మంజూరైన పనులను ఎంపిడిఓ సతీష్, పిఆర్ ఏఈ సురేంద్రవర్మ పరిశీలించారు. పనులను నాణ్యతతో ఉండే విదంగా చుచుకోవాలని అన్నారు. ప్రధానోపాధ్యాయులు జంగం అశోక్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ బైండ్ల రాధ, సిఆర్పి నగేష్, ఐకెపి నాగమణి, తదితరులు ఉన్నారు.

జాతీయ రహదారిపై లారీ దగ్ధం



మంటలార్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నవతెలంగాణ-బాల్కొండ

మండల పరిధిలోని చిట్టాపూర్ వద్ద మంగళవారం 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న ఇసుక లారీఅగ్ని ప్రమాదం సంభవించి దగ్ధమైంది. లారీ క్యాబిన్ నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై వెంటనే జాతీయ రహదారిపై లారీని నిలిపివేశాడు. అయితే లారీని చూస్తుండగానే మంటలు అంటుకొని ముందు భాగం కాలిపోయింది. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తోనే జరిగిందని డ్రైవర్ వెల్లడించారు. ప్రమాదంలో లారీ ముందు భాగం దాదాపు పూర్తిగా కాలిపోయింది. ఈ విషయం తెలుసుకున్న వాహనదారులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. సకాలంలో స్పందించిన ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అగ్నిమాపక సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ టి.హరికృష్ణ, ఫైర్ మాన్ ఎం నరేష్, డ్రైవర్ టి సుభాష్, హెూంగార్డ్ భూమేశ్వర్ ఉన్నారు.

వరి ధాన్యాన్ని పరిశీలించిన ఏఈఓ

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో ఏఈఓ రాకేష్ వరి కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, వరి ధాన్యాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ.. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి ధాన్యాన్ని తడవకుండా తాటిపత్రులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తడిసిన వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈవో

ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు ఫర్నీచర్ సిద్ధం

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో రాబోవు ఎన్నికల పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఫర్నిచర్‌ను సాటాపూర్ గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ ప్రాథమిక పాఠశాల నుంచి తీసుకున్నారు. నేటితో పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో ముందు జాగ్రత్తగా ఫర్నిచర్‌ను ప్రధానోపాధ్యాయుల నుంచి తీసుకున్నట్టు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో నాలుగు పోలింగ్ కేంద్రాలకు సరిపడా ఫర్నిచర్‌ను పాఠశాల నుంచి సేకరించినట్లు ఆయన తెలియజేశారు.



సిద్ధంగా ఉన్న ఫర్నీచర్

కన్నతల్లిలాంటి కాంగ్రెస్‌కు ఓటెయ్యండి

- ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు
- పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-లింగంపేట్

కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి తమ అమూల్యమైన ఓటు వేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జహీరాబాద్ పార్లమెంట్ సురేష్ షెట్కార్‌కు ఓటేసి గెలిపించాలని ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు ఓటర్లను వేడుకున్నారు. మంగళవారం మండలంలోని ఐలాపూర్, పోల్కంపేట్ గ్రామాలలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఐలాపూర్ గ్రామంలో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు తాడూరి బాలాగౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ రాజకీయాల్లో చక్రం తిప్పిన మహానీయుడు అన్నారు. గల్లీ నుంచి ఢిల్లీ దాకా



ఎమ్మెల్యేకు హారతులతో స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

రాజకీయంగా ఎన్నో పదవులు చేపట్టాలన్న ఆయన చేసిన సేవలను కొనియాడారు. గ్రామాల్లో ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వెళుతూ అడుగడుగునా మహిళలు హారతులు ఇస్తూ స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి తమ అమూల్యమైన ఓటును కన్నతల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. పేదల పక్షాన కాంగ్రెస్ పార్టీ నిలుస్తుందని అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిన గణిత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు వచ్చినటువంటి వాగ్దానాలను నెరవేరుస్తుందన్నారు. 6 గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే నాలుగు గ్యారెంటీలు అమలు చేసిందని త్వరలోనే రెండు గ్యారెంటీలు అమలు చేస్తుందని వివరించారు. అభివృద్ధి విషయంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తానని ఆయన గ్రామస్తులకు హామీనిచ్చారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని తెలిపారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, లింగంపేట్ జెడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సుప్పాల రాజు, సర్పంచులు రామ్‌రెడ్డి, పద్మ నాగరాజు, లక్ష్మయ్య, రాజశేఖర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవం



పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థినులు

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.రాధిక, లైబ్రేరియన్ ఎ.పూర్ణిమ ప్రారంభించారు. అలాగే పుస్తక పఠనం ప్రాముఖ్యత, పుస్తకం గొప్పతనం గురించి బి.జెడ్.సి తృతీయ సంవత్సరం చదువుతున్న బి.రాగవర్షిని వివరించింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వి.రేణుక, అకాడమిక్ కోఆర్డినేటర్ కే. వనజ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గిరిజనులకు అండగా కాంగ్రెస్ పార్టీ

- గిరిజన తండాలో జడ్పిటిసి ఎన్నికల ప్రచారం



ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ

నవతెలంగాణ-లింగంపేట్

కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనులకు అండగా ఉందని లింగంపేట్ జెడ్పిటిసి సభ్యురాలు ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని లింగంపల్లి తండా, కోయగుండు తండా, ఎల్లారం తాండ, గట్టు మైసమ్మ తండా, గిరిజన తండాలో గిరిజనుల వద్దకు వెళ్లి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను గిరిజనులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజనులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గిరిజనులకు న్యాయం జరిగిందన్నారు. అటవీ చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించి వేలాదిమంది గిరిజనులకు పోడు పట్టాలిచ్చిందన్నారు. నేటికీ గిరిజనులు కాంగ్రెస్ పార్టీని మర్చిపోరని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సురేష్ షెట్కర్‌కు ఓటేసీ గెలిపించాలని ఆయన ఓటర్లను వేడుకున్నారు. సమస్యలను దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరిస్తానని గిరిజనులకు హామీ ఇచ్చారు. ఈ ప్రచారంలో జడ్పిటిసి ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మైనార్టీ రఫీయొద్దీన్, మాజీ ఎంపీపీ ఆసియా మోహిద్, సర్పంచ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు జొన్నల రాజు, మాజీ ఎంపిటిసీ ఏదులు కోయాగుండు తండా గిరిజనులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు



పిట్లంలో..



కామారెడ్డిలో పూజల్లో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-విలేకరుల బృందం

పిట్లం : మండలంలోని పలు గ్రామాలలో హనుమాన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మి హనుమాన్ మందిరంలో ఉదయం 7గంటల నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి జయంతి వేడుకలు, జన్మనామ వృత్తాంతము, హనుమాన్ పారాయణం, కీర్తనలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం గంగ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా పోతురెడ్డి పల్లి సాయంత్రం శోభయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గంగాధర్, ప్రసాద్, ఉప్పు విట్టల్, గంగ ప్రవీణ్, మండలి వేణు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని అన్ని గ్రామాల్లో తండాల్లో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు తనాజీరావు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని పోసానిపేట్, మద్దికుంట, రామారెడ్డి, ఆయా గ్రామాల్లో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా హనుమాన్ శోభయాత్రను నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, పోతుల చిన్న భాస్కర్‌రెడ్డి, రాజాగౌడ్, బొమ్మిడి రాజురెడ్డి, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

స్వప్నలోక్‌లో ఘనంగా హనుమాన్ జయంతి..

కామారెడ్డి : కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లిలోని గాల స్వప్నలోక్ కాలనీలో మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ జండా ఎగరవేసి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. స్వప్నలోక్ కార్యసాధక శ్రీ అభయాంజనేయ స్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి, సింధూర పూజలతో ఘనంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్వప్నలోక్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు, భక్తులు, శ్రీ కొవ్వూరి వెంకటేశ్వర శర్మ, కొవ్వూరి హర్ష తదితరులులు పాల్గొన్నారు.



గాంధారిలో...

సదాశివనగర్ : మండలంలోని అన్ని గ్రామలలో హనుమాన్ జయంతిని నిర్వహించారు. వాహనాలపై హనుమాన్ చిత్రపటాలను ఏర్పటుచేసి డిజె లతో ప్రధాన వీధుల గుండ ర్యాలి నిర్వహించారు.



సదాశివనగర్‌లో..



రామారెడ్డిలో అన్నదానంలో పాల్గొన్న గ్రామస్తులు

మహిళ అదృశ్యం

- భర్త ఫిర్యాదుతో కేసు నమోదు



నవతెలంగాణ-కామారెడ్డి

తన భార్య కనిపించడం లేదని రామారెడ్డి మండలం పోసానిపేట గ్రామానికి చెందిన తెడ్డు అనిత (25) భర్త బాలయ్య కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బాలయ్య భార్య తట్టు అనిత మంగళవారం ఉదయం ఇంటి వద్ద నుంచి బయలుదేరి పసరికలకు మందు తాగి వస్తానని బీబీపేట్ మండలంలోని జనగామ గ్రామానికి వెళ్తున్నట్లుగా ఇంట్లో చెప్పి వెళ్ళింది. ఆ తర్వాత కామారెడ్డిలో బస్టాండ్‌లో ఆటో దిగినట్లుగా తనతో ఫోన్‌లో మాట్లాడిందని, ఆ తర్వాత నుండి ఫోన్ చేస్తే ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని భర్త బాలయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈమె ఆచూకీ తెలిసిన వారు కామారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు.

ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ఉద్యోగ విరమణ



ప్రధానోపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉషారాణి ఉద్యోగ విరమణను పురస్కరించుకొని పిఆర్‌టియు టిఎస్‌టి, సోమలింగంగౌడ్, సాయిరెడ్డి, ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రధానంగా ఉపాధ్యాయుల పాత్ర గొప్పదని మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి గణేష్‌రావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, నోడల్ అధికారి ఆంజనేయులు, ఉపాధ్యాయులు బి.వెంకటలక్ష్మి, పరమేశ్వర్, సాయన్న, రాజేశ్వర్, ప్రభాకర్, శ్రీనివాస్, రాధా, లక్ష్మీ దేవమ్మ, శ్రీధర్ కులకర్ణి, జగదీష్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీ నారాయణ టెంపుల్ నూతన చైర్మన్‌గా సందుర్వార్ హనుమాన్లు

- పాత కమిటీ రద్దు.. నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనారాయణ టెంపుల్ నూతన చైర్మన్‌గా సందూర్‌వార్ హనుమాన్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఆలయ పాత కమిటీని గ్రామస్తులు ఏకగ్రీవంగా రద్దు చేస్తూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పాత కమిటీ రద్దు కావడం నూతన కమిటీని అయిదుగురు సభ్యులతో ఎన్నుకున్నారు. చైర్మన్‌గా సందుర్‌వార్ హనుమాన్లు, వైస్ చైర్మన్‌గా బండివార్ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా కంచిన్వార్ రవి, కోశాధికారిగా కంచినివార్ నాగేష్, కమిటీ సభ్యులుగా బండివార్ అనిల్ ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో రాబోయే లక్ష్మి నారాయణ రథోత్సవాలు జరగనున్నాయి. గల్లీవాసులు గ్రామస్తులు లక్ష్మినారాయణ రథోత్సవాల వేడుకలు విజయవంతనికి సహకరించాలని నూతన కమిటీ సభ్యులు కోరారు.

ఆంజనేయస్వామి జయంతి వేడుకల్లో ఎంపీ బీబీ పాటిల్,

- ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు, కలిసి ప్రత్యేక పూజలు చేశారు

నవతెలంగాణ-మద్నూర్

ఆంజనేయస్వామి జయంతి వేడుకలకు జహీరాబాద్ ఎంపీ బిబి పాటిల్, జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు పాల్గొని పార్టీలకు అతీతంగా కలిసి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటు తెలంగాణ అటు మహారాష్ట్ర, కర్ణాటక మూడు రాష్ట్రాల భక్తుల్లో ప్రసిద్ధిగాంచిన మన రాష్ట్ర సరిహద్దు మద్నూర్ మండలంలోని సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ఆలయం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధీనంలో కొనసాగుతుంది. ఆలయ ఆవరణలో పెద్ద జాతర నిండింది. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. మద్నూర్ ఎస్సై బిచ్కుంద, సీఐ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు కొనసాగుతోంది. ఈ ఆలయ సందర్శన ప్రత్యేకత ప్రతి సంవత్సరం జన్మదిన వేడుకల రోజున మూడు రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలిరావడం మూడు రాష్ట్రాల సరిహద్దు ఆలయం మూడు రాష్ట్రాల భక్తుల్లో ప్రఖ్యాత గాంచింది.

అట్టహాసంగా లిటిల్ స్కాలర్స్ వార్షికోత్సవ వేడుకలు

- పాల్గొన్న ప్రో కబడ్డీ తెలుగు టైటాన్స్ ప్లేయర్ సిద్ధార్థ దేశాయ్
- శాలువాతో సన్మానించిన యాజమాన్యం



సిద్ధార్థదేశాయ్‌ను సన్మానిస్తున్న స్కూల్ యాజమాన్యం

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను జిల్లా కేంద్రంలోని సత్యా కన్వెన్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ, కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ, ప్రోకబడ్డీ తెలుగు టైటాన్స్ ప్లేయర్ సిద్ధార్థ దేశాయ్ పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సిద్ధార్థ దేశాయ్ మాట్లాడుతూ.. పిల్లల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసినందుకు పాఠశాల యజమానాన్ని అభినందించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ పున్న రాజేష్ మాట్లాడుతూ.. పాఠశాలలో జరిగే ప్రత్యేక కార్యక్రమాల గురించి వివరించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా హాజరైన తల్లిదండ్రులకు, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. పాఠశాల యజమాన్యం ప్రో కబడ్డీ తెలుగు టైటాన్స్ ప్లేయర్ సిద్ధార్థ దేశాయిని శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్న రాజేశ్వర్, పాఠశాల చైర్మన్ పున్న పున్న అరుణ, పాఠశాల డైరెక్టర్ రాజేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీని నమ్మొద్దు

- పదేండ్లు ఎంపీగా ఉన్న బీబీ పాటిల్ ఏం చేశారు
- పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే



మాట్లాడుతున్న హనుమంత్ షిండే

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని.. అలాగే పదేండ్ల కాలంగా జహీరాబాద్ ఎంపీగా గెలిపిస్తే బీబీ పాటిల్ మద్నూర్ మండలానికి ఏమి చేశాడని? జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హనుమంత్ షిండే ప్రశ్నించారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రాత్రి మద్నూర్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్ రోడ్ షో ప్రచారాన్ని నిర్వహించారు. ఆయన వెంట మూడుసార్లు జుక్కల్ ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలందించిన మాజీ ఎమ్మెల్యే హనుమంతు షిండే ప్రచార సభలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో మోసపూరితమైన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని అలాంటి కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మవద్దని ఇక బిజెపి పార్టీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బీబీ పాటిల్ రెండుసార్లు ఎంపీగా గెలిపిస్తే ఈ మండలానికి చేసింది ఏమీ లేదని అన్నారు. బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చి హామీలను నమ్మవద్దని తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే పార్లమెంటులో అభివృద్ధి కోసం ప్రజల తరపున గొంతు వినిపిస్తామని, గాలి అనిల్ కుమార్ గెలుపు కోసం కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని రోడ్ షో ప్రచారంలో కోరారు.

అయ్యపల్లిలో పెద్దమ్మ బోనాలు



బోనాలతో వెళ్తున్న ముదిరాజ్ కులస్తులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని అయ్యపల్లి గ్రామంలో ముదిరాజుల ఆరాధ్యమైన పెద్దమ్మ తల్లికి బోనాల ఊరేగింపు మంగళవారం నిర్వహించారు. ముదిరాజ్ కులస్తులు నూతనంగా పెద్దమ్మ ఆలయం నిర్మాణం చేపట్టారు. ఇందులో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం ప్రారంభమై చివరి రోజు మంగళవారం ముదిరాజులు అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం ఇంటింటికీ బోనాలను అలంకరించి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పుసప్పులతో పోతురాజుల విన్యాసం శివసతుల పూనకాలతో బోనాల ఊరేగింపు నిర్వహించారు. పెద్దమ్మ ఆలయం వరకు బోనాల ఊరేగింపు కొనసాగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'తెలంగాణ ఉద్యమ సాహిత్యం' పుస్తకావిష్కరణ

నవతెలంగాణ-కామారెడ్డి

నేడు 'తెలంగాణ ఉద్యమ సాహిత్యం' పుస్తకావిష్కరణను నిర్వహించనున్నట్టు కవి, రచయిత గఫూర్ శిక్షక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం సాయంత్రం 5 గంటలకు కామారెడ్డిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో గల అమరవీరుల స్థూపం వద్ద ఈ పుస్తక ఆవిష్కరణ ఉంటుందని, ప్రముఖ కవి, రచయిత, కాలమిస్ట్ డాక్టర్ జి.లచ్చయ్య ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పరిశోధక పుస్తకం ఆవిష్కరణ కార్యక్రమానికి కవులు, రచయితలు, తెలంగాణ ఉద్యమకారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

బిఎడ్ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో బీఎడ్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ఐదవ రోజు ప్రశాంతంగా జరిగాయి. మంగళవారం జరిగిన పరీక్షలకు 283 మంది విద్యార్థులకు 267 మంది విద్యార్థులు హాజరయ్యారు 16 మంది గైరాజరయ్యారు.

బీఎడ్ పరీక్ష కేంద్రాలు

గిరిరాజ్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల నిజామాబాద్, ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామారెడ్డి, ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల బాన్సువాడ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్మూర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోధన్ సెంటర్లలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

నిజామాబాద్ లోక్‌సభ ఇంచార్జ్‌గా రామ్మూర్తి గోపి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ పార్లమెంట్ లోకసభ ఇంచార్జ్‌గా రామ్మూర్తి గోపిని తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ కమిటీ నియమించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు శివ సేన రెడ్డి, జాతీయ యువజన కాంగ్రెస్ కార్యదర్శి, రాష్ట్ర బాద్యులు సురభి ద్వివేది తనపై నమ్మకంతో నిజామాబాద్ పార్లమెంట్ బాధ్యతలు అప్పగించినందుకు ధన్యవాదాలు తెలిపారు. నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలుపులో యువజన కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాల్సిన అవసరం బాధ్యత ఉంది అని, ప్రతి ఒక్క యువజన కాంగ్రెస్ నాయకుడు, కార్యకర్తలు కష్ట పడి నిజామాబాద్ గడ్డ మీద కాంగ్రెస్ జండా ఎగర వేద్దాం అని అన్నారు.

చదువు క్రమశిక్షణనే విజయానికి సోపానాలు



జ్ఞాపికను అందజేస్తున్న కరస్పాండెంట్

నవతెలంగాణ-సిరికొండ

మండలకేంద్రంలోగల కిడ్స్‌పార్క్ స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్‌డేను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలు రాసిన పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపిక, గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ.. పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు కనబరిచిన విద్యార్థులకు ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సంపాదించి, భవిష్యత్తులో అత్యున్నతమైన స్థాయిలో ఉండాలని పిల్లలకు సూచించారు. నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి పిల్లలందరూ మంచిగా చదివి తల్లిదండ్రుల పేరును నిలబెట్టాలని విద్యార్థులను కోరారు. రేపటి నుండి వేసవి సెలవులు ఉండడంవల్ల పిల్లలను బయటకు తీసుకు వెళ్లొద్దని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ సయ్యద్ ఆసిఫ్, షకీల్, ఫెరోజ్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్‌డేను ఘనంగా నిర్వహించారు. నర్సరీ నుండి తొమ్మిదవ తరగతి వరకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి మాట్లాడుతూ పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం ద్వారా మంచి ఉల్లాసాన్ని అందించడానికి ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇందుకు సహకరించిన తల్లిదండ్రులకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల యజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు

చేపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎంపిక

నవతెలంగాణ-ఆర్మూర్



మండలంలోని చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న పతాని సురేందర్ ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో జరిగే సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి మంగళవారం తెలిపారు. ఈనెల 26న ఎస్సీఆర్టీ ఆధ్వర్యంలో జరిగే సైన్స్ సెమినార్లో 'సైన్స్ ఎడ్యుకేషన్ రైసింగ్ భారత్' అనే అంశంపై "పాఠశాల ఆవిష్కరణలకు కేంద్ర బిందువు" అనే ఉప అంశం కింద సెమినార్లో పేపర్ ప్రజెంటేషన్ లో పాల్గొంటారని తెలిపారు. ఉపాధ్యాయుడు రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపిక కావడం సంతోషకరమని అన్నారు. ఈ సందర్భంగా సురేందర్‌ను సీనియర్ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, అనసూయదేవి గంగాధర్, రఘునాథ్, అశోక్, భాగ్యలక్ష్మి జిల్లా సైన్స్ అధికారి గంగా కిషన్ తదితరులు అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని చేపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ హిందీ భాషోపాధ్యాయురాలుగా విధులు నిర్వహిస్తున్న బి. అనసూయ దేవి మే నెలలో "పదవి విరమణ" పొందుతున్న సందర్భంగా ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో మంగళవారం శాలువ పూల మాలతో సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చేతనకుమారి, ఉపాధ్యాయులు మాధవరెడ్డి, గంగాధర్, రఘునందన్, అశోక్, సురేందర్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కుప్పలు పరిశీలన



నవతెలంగాణ-ఆర్మూర్

నియోజకవర్గంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షాలతో రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం కుప్పలు తడిసిపోగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు ఆశన్న గారి జీవన్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

16 నామినేషన్లు దాఖలు

- రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నామినేషన్‌ను స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నిజామాబాద్ లోక్ సభ నియోజకవర్గ స్థానానికి మంగళవారం పదహారు (16) నామినేషన్లు దాఖలు అయ్యాయని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు తెలిపారు. బహుజన్ లెఫ్ట్ పార్టీ అభ్యర్థిగా అశోక్‌గౌడ్ అబ్బగోని, ఆలిండియా బీసీ ఓబీసీ పార్టీ అభ్యర్థిగా పోతు నవీన్, ప్రజాసేన పార్టీ అభ్యర్థిగా పోతు నాగార్జున్, ఆలిండియా నేషనల్ పార్టీ అభ్యర్థిగా ఎం.డీ.షాహెద్ ఖాన్, దళిత బహుజన పార్టీ అభ్యర్థిగా గోలి నరేష్ నామినేషన్లు సమర్పించారని వివరించారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొత్తకొండ శక్తిప్రసాద్, బీబీనాయక్, మహమ్మద్ జమీల్, జి.సాయికృష్ణ మూర్తి నామినేషన్ వేశారని అన్నారు. అలాగే, ఇప్పటికే స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు వేసిన రాపెల్లి సత్యనారాయణ రెండవ సెట్‌ను, రాపెల్లి శ్రీనివాస్, మూడవ సెట్ నామినేషన్ పత్రాలను సమర్పించారని తెలిపారు. ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థిగా కండెల సుమన్ కూడా మూడవ సెట్ నామినేషన్ దాఖలు చేశారని అన్నారు. వీరితో పాటు అలయెన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా యుగంధర్ గట్ల, యుగ తులసి పార్టీ అభ్యర్థిగా కోటగిరి శ్రీనివాస్, విద్యార్థులు రాజకీయ పార్టీ అభ్యర్థిగా భూక్య నందు మూడవ సెట్, స్వతంత్ర అభ్యర్థిగా కాట్రాజి ప్రశాంత్ రెండవ సెట్ నామినేషన్లు వేశారని వివరించారు. కాగా, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ స్థానానికి ఇప్పటివరకు 26 మంది అభ్యర్థులు మొత్తం 44నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి రాజీవ్ గాంధీ హనుమంతు తెలిపారు.

హనుమాన్ ఆలయాల్లో అన్నదానం

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలో సర్వసమాజ్ కమిటీ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ కాట్పల్లి నర్సారెడ్డి, కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాక్లూర్ : గ్రామ కమిటీల ఆధ్వర్యంలో హనుమాన్ జన్మదినం నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామాల్లో శోభాయాత్రను చేపట్టారు. అన్నదానం చేశారు.

ఆర్మూర్ : పట్టణంతోపాటు మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, మామిడిపల్లి మండలంలోని చేపూర్ ,గోవింద్ పెట్ ఇస్స పెల్లి తదితర గ్రామాలలో, ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ వినయ్ రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని చేపూర్ గ్రామంలో జరిగిన హనుమాన్ జయంతి వేడుకలలో బీసీ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి అరుణ జ్యోతి, మాజీ సర్పంచ్ ఇందూరు సాయన్న తదితరులు పాల్గొన్నారు. మామిడిపల్లి శ్రీ అనంత ఆంజనేయస్వామి ఆలయంలో 15 క్వింటాళ్ల బియ్యంతో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వీర హనుమాన్ విజయ యాత్ర భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కవిత కాశీరాం, రవి గౌడ్ ,ఆకుల రాము వీడిసి బృందం, తూర్పు రాజు, చంటి మనోహర్, వడ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజామాబాద్ : జిల్లా కేంద్రంలో 36వ డివిజన్ అంబేద్కర్ కాలనీలో శ్రీ సాయి కేసరి వీరాంజనేయ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా హనుమంతునికి అభిషేకాలు అర్చనలు చేశారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు? అధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గుప్తా, కోశాధికారి శివరాజ్ గౌడ్, సలహాదారులు యాదయ్య, అరుణ్ బాబు, సహదేవ్, కార్యదర్శులు చిన్న సత్యం, రాజేష్, ప్రసాద్, బాబూరావు, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.



మాక్లూర్ : అన్నదానంలో పాల్గొన్న భక్తులు



ఆర్మూర్ : హనుమాన్ జయంతిలో పాల్గొన్న ఎమ్మెల్యే

గురుకులాలకు 19మంది విద్యార్థుల ఎంపిక



నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 19మంది విద్యార్థులు వివిధ గురుకులాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు శంకర్ గౌడ్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతిలో ప్రవేశానికిగాను ప్రభుత్వ నిర్వహించిన ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచడం ద్వారా 19 మంది విద్యార్థులు వివిధ గురుకులాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఒకేసారి పాఠశాలకు చెందిన 19మంది వివిధ గురుకులాలకు ఎంపిక ఇవ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాలలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో వివిధ గురుకులాలకు ఎంపికైన 19 మంది విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

బడులకు నేటి నుంచి సెలవులు

- జూన్ 12న పున: ప్రారంభం

నవతెలంగాణ- నిజామాబాద్‌సిటీ

పాఠశాలలకు నేటి నుండి సెలవు లు ఉంటాయని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24 నుండి జూన్ 11 వరకు సెలవులు ప్రకటించినట్టు పేర్కొన్నారు. పాఠశాలల యాజమాన్యాలకు వేసవి సెలవుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. ఏదేని పాఠశాల వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించినట్లైతే విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకువస్తే ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వ నిభందనల ప్రకారం ఆ పాఠశాలలను మూసివేసి గుర్తింపును రద్దు చేస్తామని పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీకి కోటపాటి రాజీనామా

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కోటపాటి నరసింహ నాయుడు పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షులు కేసీఆర్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. 2018 సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీలో చేరి, ఈ ప్రాంతంలో పార్టీ అభ్యర్థుల విజయానికి తన వంతు కృషి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా వివిధ రాష్ట్రాలలో తెలంగాణ మోడల్ అభివృద్ధిని ఇతర రాష్ట్రాల రైతులకు తెలుపుతూ పర్యటించడం జరిగిందన్నారు. అంతర్రాష్ట్ర వేదికలపై తెలంగాణ మోడల్ ప్రాచుర్యం కల్పించడం జరిగిందని పార్టీ తన సేవలను గుర్తించ లేదని అన్నారు. మరోవైపు 2006 నుండి పసుపు బోర్డు కోసం పోరాటం చేయడం జరిగిందని తెలిపారు. వ్యక్తిగతంగా గౌరవించినందుకు బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్, మాజీ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ రాజీనామాను ఆమోదించాలని కోరారు.